సాక్షి చిత్తూరు

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

పలమనేరులో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువెత్తాయి. కలెక్టర్, జేసీ తదితరులు వినతులు స్వీకరించారు. - 8లో



ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి

బధిరులు జీవితంలో ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి సూచించారు. - 8లో



గోసంరక్షణకే పాదయాత్ర

ధర్మపరిరక్షణలో భాగంగా గో సంరక్షణకు పాదయాత్ర చేస్తున్నామని ఉడిపి పీఠాధిపతి ఈషాప్రియస్వామీజీ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

పోలీసు గ్రీవెన్స్‌కు 41 ఫిర్యాదులు



బాధితుడి సమస్యపై ఆరా తీస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 41 వినతులు అందాయి. చిత్తూరు ఎస్పీ మణికంఠ ఏఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో మోసాలు, వేధింపులు, కుటుంబ తగాదాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్ హౌజ్ అధికారులతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యపై విచారణ జరిపి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగం



ఏపీసీకి జ్ఞాపిక అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ లలిత

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని సమగ్రశిక్షా శాఖ ఏపీసీ వెంకటరమణ తెలిపారు. ఆయన సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిబిరంలో స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, క్యారమ్స్, కథలు చెప్పడం, వినడం, క్విజ్, పేపర్ క్రాఫ్ట్‌లలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో–2 మోహన్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా శిక్షణా శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజయం విద్యాసంస్థల ఏఓ రాజగోపాల్, జన విజ్ఞాన వేదిక మాజీ కోఆర్డినేటర్ రంగనాథన్, డిప్యూటీ లైబ్రేరియన్ లలిత తదితరులు పాల్గొన్నారు.

అసలే ముఖ్యమంత్రి నియోజకవర్గం.. ఓ వైపు బెదిరింపులు.. మరో వైపు దాడులు.. ఇంకో వైపు పదవులు, బహుమతుల ప్రలోభాలు.. ఇవన్నీ తృణప్రాయమంటూ వైఎస్సార్ సీపీకి చెందిన 9 మంది కౌన్సిలర్లు.. టీడీపీ చూపిన ఆశలకు లొంగకుండా కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పాల్గొన్న మీరే మా నాయకులు అంటూ ఆయా వార్డు జనం పొగడ్తలు.. సోమవారం ప్రజాస్వామ్యంలో ఒక బ్లాక్‌గా అభివర్ణించుకున్న కుప్పం జనం.



బెంగుళూరు క్యాంపు నుంచి చైర్మన్ ఎన్నికకు వచ్చిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

జగనే మా దైవం..
ప్రలోభాలకు లొంగం!

డబ్బు, పదవులకు లొంగని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

- అడ్డదారిలో కుప్పం చైర్మన్‌గిరి టీడీపీ కైవశం
- ఎదురొడ్డి నిలిచిన తొమ్మిది మంది సభ్యులు
- కొనియాడుతున్న కుప్పం జనం
- నైతిక విజయం వైఎస్సార్ సీపీదే

కుప్పంరూరల్: హ్యాట్సాప్ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అని కుప్పం జనం మెచ్చుకుంటున్నారు. ఎందుకంటే ప్రలోభాలు, బెదిరింపులు, దాడులకు వెరవకుండా మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పక్షాన నిలిచిన కౌన్సిలర్లకు వందనం..శత వందనం.. మీరే నిజమైన మా నాయకులు అని కుప్పం జనం కొనియాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎలాగైనా కుప్పం మున్సిపల్ చైర్మన్‌గిరిని దక్కించుకోవాలని అధికార పార్టీ మదిలో పడింది. ఇందుకు అనుగుణంగానే ప్రణాళికలు సిద్ధం చేసింది. కుప్పం కౌన్సిల్‌లో ఉన్న సభ్యులకు బెదిరింపులు, వేధింపులు మొదలు పెట్టింది. మొదటగా నలుగురు కౌన్సిలర్లు టీడీపీకి సరెండర్ అయ్యారు. తరువాత 2024 నవంబర్‌లో డాక్టర్ సుధీర్ చైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేశారు. అప్పటివరకు ఉన్న కౌన్సిల్‌లో మార్పులు వచ్చాయి. చైర్మన్ రాజీనామా చేసి వెళ్లిపోగా, సభ్యుల సంఖ్య 24కు చేరింది. నలుగురు టీడీపీ వైపు వెళ్లిపోవడంతో వైఎస్సార్ సీపీకి ఉన్న బలం 19 నుంచి 14కు చేరింది. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు 28న ఎన్నికలు ఖరారు చేసింది. ఖరారు చేసినప్పటి నుంచి అధికార పార్టీ వైఎస్సార్ సీపీ వారిని రకరకాలుగా ప్రలోభాలకు గురిచేసింది. ఒక్కొక్కరికి రూ.50 లక్షలు ఆశ చూపింది. మరి కొంత మందికి ఉద్యోగం, మరొకరికి ఏకంగా చైర్మన్ పదవే ఆశ చూపారు. వీరి ప్రలోభాలకు నలుగురు ఆకర్షితులు కాగా, మరో ఇద్దరు ఓటింగ్‌కు దూరమయ్యారు. కానీ ఎమ్మెల్సీ భరత్‌తో పాటు 9 మంది సభ్యులు మాత్రం రూ.లక్షల డబ్బు, ఉద్యోగాలు, పదవులు దేన్నీ లెక్క చేయక వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల్లో పాల్గొన్నారు. ఓటమి దరిదాపుల్లోకి వచ్చినా ఎక్కడా వెరవక తమను ఎన్నుకున్న ప్రజలు, పార్టీ తరఫున నిలబడి ఎన్నికల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ దొడ్డిదారి కొంత మంది కౌన్సిలర్లను కొని చైర్మన్ గిరి దక్కించుకోగా, వైఎస్సార్ సీపీ సభ్యులు మాత్రం నైతిక విజయం మాదే అంటు వెనుతిరిగి, కుప్పం జనం మనస్సు గెలుచుకున్నారు.

ప్రజాస్వామ్యం..అపహాస్యం

- కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక దుర్మార్గం
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీని బలహీనపరచాలన్న దురాలోచనతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబు అపహాస్యం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ ఉపఎన్నికపై సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం మున్సిపాలిటీలో టీడీపీకి బలం లేకపోయినా దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. ఆరుగురు కౌన్సలర్లతో కుప్పం మున్సిపాలిటీని ఎలా కైవసం చేసుకోగలదని ప్రశ్నించారు. తన సొంత నియోజకవర్గంలో ఓటమి పాలవుతారన్న భయంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఒక్కొక్కరిని రూ.50లక్షలతో కొనుగోలు చేసినట్లు ఆరోపించారు. కేవలం పది నెలల పదవీ కాలం మాత్రమే ఉన్న కుప్పం మున్సిపాలిటీ ఎన్నికల్లో చంద్రబాబు ఇంతటి అరాచకాలు సృష్టించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎవరైనా కూటమి ప్రభుత్వంలో చేరడానికి వస్తే చేర్చుకునే ప్రసక్తేలేదని చంద్రబాబు నీతులు ఒలకబోశారని గుర్తుచేశారు. గత రెండు నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాడిపత్రి మున్సిపాలిటీలో టీడీపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లను వైఎస్సార్‌సీపీ వైపు తిప్పుకుని ఉంటే తమ పార్టీనే చైర్మన్ పదవి చేపట్టి ఉండేదని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా టీడీపీకి మెజారిటీ లేకపోయినా స్థానిక సంస్థల ఎన్నికల్లో కౌన్సిలర్లను, కార్పొరేటర్లను కొనేసి గెలుచుకున్నామంటూ గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబు నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. చంద్రబాబు అరాచకాలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

మా పయనం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే..

తాము మనస్సాక్షికి, తమను ఎన్నుకున్న ప్రజలకు కట్టుబడి ఉన్నామని, తమ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి నేర్పిన క్రమశిక్షణతో నడుచుకుంటామని 9 మంది అంటున్నారు. తమ నాయకుడు తమకు అడ్డదారులు నేర్పలేదని, డబ్బు, బహుమతులకు లొంగే అలవాట్లు నేర్పలేదన్నారు. ప్రజాసేవకే అంకితమైన తమ నాయకుడు చూపిన బాటలోనే నడుస్తామని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అంటున్నారు. తమపై నమ్మకం ఉంచిన ప్రజలకు న్యాయం చేయడమే తమ అంతిమ చర్యగా పేర్కొంటున్నారు.

వీళ్లే మా నేతలు అంటున్న జనం

ఎలాంటి ప్రలోభాలకు లొంగక చివరి వరకు పోరాడిన వీరే తమ నాయకులని ఆయా వార్డు జనం అంటున్నారు. తమ విలువైన ఓటు వేసి గెలిపించినందుకు తమకు ఇప్పుడు గర్వంగా ఉందన్నారు. ఇతరుల మాదిరిగా వ్యక్తిగత ప్రయోజనాలకు పోకుండా ప్రజాక్షేమమే ధ్యేయంగా నడుచుకున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల వెంటనే తాము ఉంటామని జనం అంటున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఫ్యాను గుర్తుకే ఓటు వేసి వీరిని నాయకులుగా ఎన్నుకుంటామని దీమా వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ చైర్మన్‌గా సెల్వరాజ్



కుప్పం: మున్సిపల్ చైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి సెల్వరాజ్ ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా చైర్మన్ ఎన్నికల ఓటింగ్‌లో 22 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. వీరిలో అధికార పార్టీ చైర్మన్ అభ్యర్థిగా సెల్వరాజ్‌ను ప్రతిపాదించగా ఆయనకు 19 వార్డు కౌన్సిలర్ దాము, 20వ వార్డు కౌన్సిలర్ సోములు సహకరించారు. వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థిగా హఫీజ్ పార్టీ ప్రకటించగా ఆయనకు 2వ వార్డు సభ్యులు మునిరాజ్, 11వ వార్డు సభ్యురాలు మాధవి ప్రతిపాదించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుడు సెల్వరాజ్‌కు 14 మంది చేతులెత్తి తమ మద్దతును పలికారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి హఫీజ్‌కు 9 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మద్దతు పలికారు. మెజారిటీ టీడీపీకే ఉండడంతో కుప్పం మున్సిపల్ చైర్మన్‌గా 5వ వార్డు కౌన్సిలర్ సెల్వరాజ్ ఎన్నికయ్యారు.

సోమవారం ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే



కుప్పంలో 144 సెక్షన్‌తో బోసిపోయిన రోడ్డు



మండల సచివాలయం వద్ద చైర్మన్ ఎన్నిక సందర్భంగా బందోబస్తు

సోమవారం జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలు, అడ్డదారుల్లో మున్సిపల్ చైర్మన్ పదవి దక్కించుకోవడాన్ని కుప్పం ప్రజలు జీర్ణించుకోవడం లేదు. సోమవారం ఒక ప్రజాస్వామ్యంలో ఒక బ్లాక్ డేగా అభివర్ణిస్తున్నారు. 18 మంది కౌన్సిలర్ల బలం స్పష్టంగా ఉన్నా ఓడి పోవడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మరికొంత మంది అంటున్నారు. దమ్ముంటే తమవైపునకు తిప్పుకున్న కౌన్సిలర్లను రాజీనామాలు చేయించి, ఉప ఎన్నికల్లో గెలిపించుకుని చైర్మన్ ఎన్నికలకు వెళ్లాల్సిందని ఘాటుగా విమర్శిస్తున్నారు. అధికారాన్ని, వ్యవస్థలను అడ్డం పెట్టుకుని గెలుచుకునే బదులు ఎన్నిక లేకుండా వారే చైర్మన్‌ను ప్రకటించుకుంటే సరిపోయేదంటున్నారు. ఏది ఏమైనప్పటికీ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగలేదని, నియంతల పాలనలో జరిగినట్లు ఉందని విశ్లేషిస్తున్నారు.

ఎన్నికల్లో అద్భుతాలు చేస్తామన్న కూటమి నేతలు అభివృద్ధిని మరిచారు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాను సమస్యలు వేధిస్తున్నాయి. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారు. ఈ క్రమంలో జనం పాలకా.. ఏమిటీ ఏలిక అని ప్రశ్నిస్తున్నారు. ఈ నెల 29వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న 3వ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనైనా వీటిపై దృష్టి సారిస్తారోలేదో చూడాల్సి ఉంది.



గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పురోగతికి నోచుకోని పక్కా గృహాలు

పాలకా... ఏమిటీ ఏలిక!

- ప్రజలకు సంక్షేమం దూరం చేసిన కూటమి సర్కారు
- జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో చర్చ నామ మాత్రమే
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సమస్యల తాండవం
- నేడు జెడ్పీలో మూడో సర్వ సభ్య సమావేశం



పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లిలో ఇసుక అక్రమ రవాణా

చిత్తూరు కలెక్టరేట్/కార్పొరేషన్:ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని మండలాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నా వాటిని పరిష్కరించడంలో కూటమి సర్కారు అలసత్వం వహిస్తోంది. దీనికితోడు ప్రజలకు సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. 14 నియోజకవర్గాల్లోని 66 మండలాల్లో గ్రామాల అభివృద్ధికి స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను ప్రజలు ఎన్నుకున్నారు. అయితే వారికి కూటమి ప్రభుత్వం అధికారాలు లేకుండా నిర్వీర్యం చేసింది. దీంతో అభివృద్ధి కుంటుపడింది.

అద్భుతాలు చేస్తామన్నారు...అభివృద్ధి మరిచారు

మా పాలన వస్తే అద్భుతాలు చేస్తాం.. ప్రతి రంగంలోని సమస్యలను పరిష్కరిస్తామం ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటామంటూ ఎన్నికల్లో చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌లు చెప్పిన మాటలివి. వారు చెప్పిన మాటలు 11 నెలలు గడుస్తున్నా ఏ ఒక్కటీ నెరవేరలేదు.

పేరుకుపోయిన ఆరోగ్యశ్రీ బకాయిలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరోగ్య శ్రీ బకాయిలు రూ.300 కోట్లకు పైగా పేరుకుపోయాయి. గడిచిన 11 నెలలుగా బకాయిలను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం విడుదల చేయకపోవడంతో ఆరోగ్య సేవలు దూరమయ్యాయి.

కరువు పరిహారం శూన్యం

గతేడాది వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 43,174 హెకార్టులు కాగా, సాగు విస్తీర్ణం 13,044 హెక్టార్లు ఉంది. ఇందులో 9 వేల హెక్టార్లలో పంట నష్టం కలిగింది. ఇందుకు రూ.15.42 కోట్లు పరిహారం ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు అందలేదు.

జెడ్పీటీసీ సభ్యుల వేతనాలు లేవ్

జెడ్పీటీసీ సభ్యులకు వేతనాలు మంజూరు చేయడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికంగా వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులే ఉన్నారు. దీంతో కూటమి సర్కారు వారికి వేతనాలను మంజూరు చేయకుండా కుట్రలు చేస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 65 జెడ్పీటీసీ సభ్యులకు దాదాపు రూ.43 లక్షల వరకు జీతాలు చెల్లించాల్సి ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు.

ట్రాన్స్‌కో సేవలు తిరుపతి నుంచే..

జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం చిత్తూరులో ఏర్పాటు చేసినా ఇంకా తిరుపతి జిల్లా నుంచే సేవలు అందిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఎస్‌ఈ కార్యాలయం ఏర్పాటై 6 నెలలవుతున్నా తిరుపతి నుంచి ఇంకా 15 మంది ఉద్యోగులు విధుల్లో చేరాల్సి ఉంది.

పెండింగ్‌లో రహదారుల బిల్లులు



సత్యవేడు నియోజకవర్గంలో గుంతల మయమైన రోడ్డు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.84 కోట్లకు పనులు చేపట్టారు. అందులో రూ.26 కోట్లు మాత్రమే ఇచ్చారు, మిగిలిన రూ.61 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. అలాగే ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.23 కోట్లతో ప్యాచ్‌వర్క్‌లు చేపట్టారు వీటి బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి.

కష్టాల ఆస్పత్రి

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి కష్టాల ఆస్పత్రిగా పేరు తెచ్చుకుంది. ఇక్కడికి చికిత్స కోసం వెళ్లే ప్రజలకు మెరుగైన వైద్యం అందకపోగా ఆరోగ్యం మరింతగా క్షీణించి అనారోగ్యం పాలవుతున్నారు. వందల సంఖ్యలో ఓపీలు వస్తున్నా సేవలు మాత్రం శూన్యం. వైద్యుల పోస్టులు ఖాళీ, ఉన్న సీనియర్ వైద్యులు సమయపాలన లేమితో రోగులు ఈ ఆస్పత్రికి వెళ్లాలంటే జంకుతున్నారు.

నియోజకవర్గాల్లో సమస్యలిలా..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నియోజకవర్గాల్లో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

కుప్పం: నియోజకవర్గంలో భూ కబ్జాలు ఎక్కువయ్యాయి. శాంతిపురం మండలంలో 15 ఎకరాలు, కుప్పం మండలం పెద్దవంక సరిహద్దులో అటవీ భూములు, ఇదే మండలంలోని బొగ్గుపల్లిలో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని టీడీపీ నేతలు కబ్జా చేశారు.

తిరుపతి: నియోజకవర్గంలో 8 చెరువులు, 395.71 ఎకరాల్లో 20 శాతం భూములు ఆక్రమణకు గురైనట్లు సమాచారం.

నగరి: నియోజకవర్గంలో రైతులకు విద్యుత్ సరఫరాలో ఎక్కువగా అంతరాయం కలుగుతోంది. నింద్ర నేటమ్స్ షుగర్స్ మూతపడటంతో చెరుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సువర్ణముఖి నదీ పరివాహక గ్రామాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. రోజుకు సగటున 800 నుంచి 900 ట్రాక్టర్లు, 150 టిప్పర్ల ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.

గంగాధరనెల్లూరు : నియోజకవర్గంలో అధికార పార్టీ భూ కబ్జాలు ఎక్కువయ్యాయి. పేదలందరికీ ఇళ్ల పురోగతికి కూటమి సర్కారు నిధులు ఇవ్వడం లేదు.

పూతలపట్టు : నియోజకవర్గంలో టీడీపీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో అక్రమ ఇసుక రవాణా సాగుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

సత్యవేడు : నియోజకవర్గంలో రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు రాకపోకలకు అవస్థ పడుతున్నారు. అలాగే పారిశుద్ధ్యం పడకేసింది.

23 మండలాల్లో తాగునీటి సమస్య

ప్రస్తుత వేసవిలో చిత్తూరు జిల్లాలోని 23 మండలాల్లో తాగునీటి సమస్యలున్నాయి. జిల్లాలోని 23 మండలాల్లో 923 గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. తాగునీటి సరఫరాకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది.



తిరుపతి చెన్నయ్యగుంటలో ప్రభుత్వ భూ కబ్జాలు



సత్యవేడు నియోజకవర్గంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్డు



సత్యవేడు నియోజకవర్గంలో అస్తవ్యస్థంగా పారిశుద్ధ్యం

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల మొత్తం వేసవి సెలవులు ప్రకటించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ప్రేమ డిమాండ్‌చేశారు. ఆ సంఘ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు మండుతున్నాయని తెలిపారు. పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కొత్తగా ప్రవేశపెట్టిన బాల సంజీవని, 2.0.0 యాప్, ఈకేవైసీ ఓటీపీ ప్రక్రియలు ఎత్తివేయాలన్నారు. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ చిన్నారులకు మే నెల మొత్తం టేక్ హోం రేషన్‌తో సెలవులు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు సైతం లేవన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు సెలవులు ప్రకటించారని, అంగన్‌వాడీ చిన్నారులకు మాత్రం సెలవులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా అధ్యక్షులు ప్రభావతి, నాయకులు అరుణ, హైమావతి, కాంచన, రాజేంద్ర, రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడిగా గోవిందస్వామి



గోవిందస్వామి

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఎం.గోవిందస్వామి (ఎస్‌జీటీ)ని ప్రకటించారు. సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్ రెడ్డి, సుధీర్ ఈ విషయం వెల్లడించారు. నూతన జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి మాట్లాడుతూ జిల్లాలోని టీచర్లకు ఎటువంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఏపీ పరిశ్రమలు, సాంకేతిక సంస్థ ఉపాధ్యక్షులు కండ్లగుంటి బాబు, తదితర ఉపాధ్యాయులు నూతన జిల్లా అధ్యక్షుడిని అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మూడు రోజుల క్రితం జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులు మణితేజ, చంద్రను టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పాత కక్షల నేపథ్యంలో శనివారం పాత కలెక్టరేట్ సమీపంలో చామంతిపురానికి చెందిన మనోజ్‌పై మణితేజ, చంద్ర కత్తితో దాడి చేసి పారిపోయారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి జడ్జి ఎదుట హాజరుపరిచారు. వారికి జడ్జి 14 రోజుల రిమాండుకు ఆదేశించడంతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని మహిళ మృతి

కుప్పంరూరల్: బెంగళూరు – చెన్నై రైల్వే మార్గంలో కుప్పం పట్టణానికి సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద సుమారు 55 ఏళ్ల మహిళ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు కుప్పం రైల్వే పోలీసులు సోమవారం తెలిపారు. మృతురాలు ఎరుపు రంగు జాకెట్, గళ్లచీర కట్టుకుందని చెప్పారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు కుప్పం రైల్వే పోలీసు స్టేషన్ 9000716436, 9494228854 నంబర్లలో సంప్రదించాలని కోరారు. మృత దేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు చెప్పారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



పలమనేరులో జరిగిన గ్రీవెన్స్‌డేలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. ఉదయం 10 గంటల నుంచే కార్యాలయ ప్రాంగణం అర్జీదారులతో నిండిపోయింది. రీసర్వే, భూ సమస్యలు, వివాదాలకు సంబంధించిన వినతులే ఎక్కువగా వచ్చాయి. సమస్యలను శాఖల వారీగా అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, పలమనేరు ఆర్డీఓ భవానీ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడల్ అర్జీలు స్వీకరించారు.

మొత్తం 436 సమస్యలు

గ్రీవెన్స్‌డేకి మొత్తం 436 వినతులందాయి. వీటిలో భూ ఆక్రమణలు 71, ఆర్‌ఓఆర్ 53, పట్టాదారు పాసు పుస్తకాలు 41, అసెన్‌మెంట్లు 14, మ్యుటేషన్లు 10, దారి సమస్యలు 20, సామాజిక పింఛన్లు 39 అర్జీలు అందాయి. మిగిలినవన్నీ పలు శాఖలు, వ్యక్తిగత సమస్యలే ఉన్నాయి.

కొందరి సమస్యలివీ..

- పెద్దపంజాణి మండలం పెనుగొలకలకు చెందిన గుర్రమ్మ తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరింది.
- పలమనేరు మున్సిపాలిటీకి చెందిన చెంగమ్మ(75) వృద్ధాప్య పింఛన్ కోసం పలుమార్లు అర్జీలిచ్చిన ఎవరూ పట్టించుకోలేదని విన్నవించింది.
- స్థానిక 17వార్డు ఏప్రిల్ నెల కోటా రేషన్ ఇవ్వలేదని పలువరు మహిళలు అర్జీ ఇచ్చారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు.
- రీసర్వేలో పట్టాభూమి డీకేటీగా నమోదు చేశారని సమస్యను పరిష్కరించాలని తొమ్మిదినెలలుగా గంగవరం రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా పట్టించుకోలేదని గంగవరం మండలం పత్తికొండకు చెందిన మంజునాథ్ తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సాయంత్రంలోపు సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
- పలమనేరులోని గాంధీనగర్ నుంచి గంటావూరుకు వెళ్లే మెయిన్‌రోడ్డు ఆక్రమణలకు గురైందని పట్టణానికి చెందిన వెంకట రెడ్డిప్రసాద్ అర్జీ ఇచ్చారు. దీనిపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
- కరెంట్ షాక్ కొట్టడంతో వెన్నుముఖ దెబ్బతిని సగం శరీరం స్పర్శ లేకుండాపోయిందని సదరంలో 91శాతం వికలత్వ సర్టిఫికెట్ ఇచ్చినా వికలాంగ పింఛను రాలేదని ఓ ట్రాన్స్‌కోలో పని చేసే కూలి తెలిపారు.
- ఎక్స్‌ప్రెస్‌హైవేకు భూములిచ్చినా ఇంకా అవార్డు పాసు చేయలేదని వి.కోట మండలం తోటకనుమకు చెందిన నవమోహన్‌రెడ్డి అర్జీ ఇచ్చారు.
- ఎస్సీలమైన తమ ఇంటిస్థలాల్లోకి రానీయకుండా అక్కడి అగ్రవర్ణాలు అడ్డుకుంటున్నారని జగమర్ల వాసులు విన్నవించారు.
- పలమనేరు నుంచి ఉదయం 4నుంచి 6 దాకా చిత్తూరు వైపు బస్సులేవని దీనిపై స్థానిక ఎమ్మెల్యే ద్వారా చెప్పించినా ఆర్టీసీ నిర్లక్ష్యం చూపుతోందని పలమనేరు పరిరక్షణ సమితి నిర్వాహకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీసీఈఓ రవికుమార్‌నాయుడు, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, డీపీఓ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

ఆశగా వచ్చారు.. నిరాశతో వెళ్లారు!



కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కరించుకుందామని ఆశతో వచ్చారు. అయితే కలెక్టరేట్‌లో కార్యక్రమం రద్దు కావడంతో ఏమీ చేయలేక నిరాశతో వెనుదిరిగారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారులు సమస్యల పరిష్కార కోసం సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేశారు. కాగా, కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసి పలమనేరులో నిర్వహించిన విషయం విదితమే. దీంతో మధ్యాహ్నం వరకు పలువురు అర్జీదారులు కలెక్టరేట్‌లో నిరీక్షించి చేసేదేమి లేక నిరాశగా ఇళ్లకు వెనుదిరిగారు.

ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలు పరిష్కరించాలి

కూటమి టీడీపీ ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోషియేషన్) జిల్లా అధ్యక్షుడు నిరంజన్, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం నిమిత్తం ఆ సంఘ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె నిర్వహించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమ్మెలో ఆ సంఘ నాయకులు మమత, రాజేష్, గణేష్, శ్రీవాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

పొలానికి దారి లేకుండా చేస్తున్నారు



మాజీ సైనికుడు రాజమాణిక్యం

తన పొలానికి వెళ్లేందుకు దారి లేకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నారని గంగాధరనెల్లూరు మండలం ముకల్లూరు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు రాజమాణిక్యం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చేందుకు విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 478/28 లో ఐదు ఎకరాల భూమి ఉందన్నారు. తాను సైనికుడిగా పనిచేసి రిటైర్డ్ అయినప్పటి నుంచి ఆ భూమిలోనే పంటలు పండించుకుని జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తన సమస్యను గంగాధరనెల్లూరు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా వీఆర్వో, ఎంఆర్ఐ వచ్చి సమస్యను పరిశీలించారన్నారు. అయినప్పటికీ తనకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ నిర్వీర్యానికి కుట్ర



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సుబ్బారావు

బంగారుపాళెం: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి, పేదల కడుపు కొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు ఆరోపించారు. సోమవారం మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిరుపేదలకు వరమన్నారు. ఈ పథకంలోని పలు అంశాలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతుందని విమర్శించారు. పేదలకడుపు కొట్టి అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తుందని మండిపడ్డారు. ఉపాధి పనిదినాలను 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలని, రోజు వేతనం రూ.600 ఇచ్చేలా పోరాటం సాగిస్తామన్నారు. 15 రోజులకు వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో 2 శాతం వడ్డీతో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హక్కులను కాపాడాలని మే నెల 20వ తేదీ చేపట్టనున్న సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ మే ఒకటి నుంచి అమలు చేసే ఇన్సూరెన్స్ పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ అమలయ్యేలా అధికారులు చరలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా అమాస రాజశేఖర్‌రెడ్డి



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు డీసీసీబీ చైర్మన్‌గా అమాస రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో కూడా డీసీసీబీగా చైర్మన్‌గా పదవి అనుభవించారు. ఈ పదవిలో 13ఏళ్లుగా కొనసాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డీసీసీబీ చైర్మన్ పదవిని మళ్లీ అమాస రాజశేఖర్‌రెడ్డే సొంతం చేసుకున్నారు. దీంతో సొంత పార్టీ నేతలే చిర్రెత్తిపోతున్నారు. అమాస రాజశేఖర్‌రెడ్డికి పదవి కట్టబెట్టడంపై భగ్గుమంటున్నారు. ఈ చైర్మన్ పదవి చిత్తూరు నగరానికి చెందిన టీడీపీ సీనియర్ నేత దొరబాబుకే ఇస్తారని తొలి నుంచి కూటమి నేతలు జోరుగా ప్రచారం చేశారు. పక్కాగా దొరబాబుకే ఇస్తారని ఆపార్టీ నేతలు బల్లగుద్ది చెప్పారు. గట్టి నమ్మకంతో ఉన్నారు. అయితే ఆ ఆశలంతా ఇప్పుడు అడియాశలయ్యాయి. కూటమి ప్రభుత్వం వారి ఆశలపై ఊహించని దెబ్బకొట్టింది. ఊహించని వ్యక్తి..అందులో గతంలో పనిచేసిన అమాసకు ఇవ్వడం ఏమిటని పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఆయన చేసిన తప్పిదాలపై పెదవి విరుస్తున్నారు.

బీరు బాటిల్‌తో దాడి..వ్యక్తి తీవ్రగాయాలు

కార్వేటినగరం: బీరు బాటిల్‌తో దాడి చేయడంతో వ్యక్తి గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొల్లాగుంట వద్ద ఉన్న మద్యం షాపులో మద్యం తాగడానికి కొటార్వేడు దళితవాడకు చెందిన భారత్‌రాజ్, అదే గ్రామానికి చెందిన జీవరత్నం, రాజ కలసి ద్విచక్రవాహనంలో వెళ్లి మద్యం కొనుగోలు చేసి, ముగ్గురు కలసి మద్యం తాగడానికి సమీపంలోని కొబ్బరి తోటకు వెళ్లారు. అయితే అదే ప్రాంతంలో మద్యం తాగుతున్న కొటార్వేడు దళితవాడకు చెందిన వెంకటేష్‌కు భారత్‌రాజ్‌కు మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దీంతో భారత్‌రాజ్‌పై వెంకటేష్ బీరుబాటిల్‌తో దాడి చేశాడు. దీంతో భారత్‌రాజ్‌కు గాయాలయ్యాయి. అలాగే భారత్‌రాజ్‌తోపాటు ద్విచక్రవాహనంలో వచ్చి జీవరత్న, రాజ కూడా వెంకటేష్‌తో కలసి భారత్‌రాజ్‌పై దాడికి దిగి గాయపరిచారు. స్థానికులు గుర్తించి అతనిని కార్వేటినగరం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై భారత్‌రాజ్ భార్య కోకిల సోమవారం పోలీసులక ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి

చిత్తూరు కలెక్టరేట్ : బధిరులు ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బధిరులకు టచ్ ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ బధిరులు (మూగ, చెవిటి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైకల్యం ఉందని నిరాశ చెందకుండా ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం రూ.15 వేలు విలువ చేసే 30 టచ్ ఫోన్‌లను జేసీ చేతుల మీదుగా బధిరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ఆసీఫ్



ధనంజయులు

చిత్తూరు అర్బన్: నగర శివారుల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో జె.ధనంజయులు (39), ఆసీఫ్ (35) అనే ఇద్దరు మృతి చెందారు. తాలూక ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు.. పెనుమూరు మండలం పూనేపల్లెకు చెందిన ఆసీఫ్ కత్తులను గీటురాయి ద్వారా సానా పట్టే వృత్తి చేస్తున్నాడు. నగర శివారుల్లోని మురకంబట్టు వద్ద ఆదివారం తన ద్విచక్రవాహనంలో వెళుతూ, ముందు వెళుతున్న లారీను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ స్కూటరిస్టు ఆదివారం అర్థరాత్రి తమిళనాడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా సోమవారం చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారిపై అనుప్పల్లె సమీపంలో జె.ధనంజయులు తన ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. తలకు బలమైన గాయం కావడంతో ధనంజయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గ్రానైట్ రాళ్లను లోడ్ చేసే వృత్తి చేస్తున్నాడు. ఈ రెండు కేసులపై ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు మందు చల్లి చైను లాక్కెళ్లారు!

పుంగనూరు: కూరగాయల సంతకు వచ్చిన ఓ వృద్ధురాలిపై మత్తుమందు చల్లి చైను లాక్కెళ్లిన సంఘటన సోమవారం పట్టణంలోని కూరగాయల సంతలో జరిగింది. సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు.. రామసముద్రం మండలం కొండూరు గ్రామానికి చెందిన సరోజమ్మ సొంత పనుల నిమిత్తం పుంగనూరుకు వచ్చి సంతలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లింది. అక్కడ ఇద్దరు యువకులు ఆమెపై మత్తుమందు చల్లారు. ఆమె ఏమి తెలియని స్థితికి వెళ్లిపోవడంతో చైనులాక్కెళ్లి పరారయ్యారు. ఆమె స్పృహలోనికి వచ్చి లబోదిబోమంటు కేకలు వేయడంతో స్థానికులు ఆమెను తీసుకెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. సుమారు 34 గ్రాములు బంగారు చైనును లాక్కెళ్లినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ లోకేష్ నిందితుల ఆచూకీ కోసం సీసీ పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పుంగనూరు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పుంగనూరు మండలంలోని చిన్నతాండా గ్రామానికి చెందిన బుక్యా విశ్వనాథనాయక్(37) గత వారం శరీరంపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ

–ఇద్దరికి గాయాలు

వెదురుకుప్పం: మండలంలోని వేణుగోపాలపురం వడ్డిఇండ్లు గ్రామంలో సోమవారం జరిగిన పరస్పర దాడుల్లో ఇరువురికి గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వేణుగోపాలపురం వడ్డిఇండ్ల గ్రామానికి చెందిన రాజవేలు అదే గ్రామానికి చెందిన కన్నయ్య వద్ద రూ.3.50 లక్షలు అప్పు చేశాడు. సోమవారం అప్పు ఇస్తానని ఇవ్వలేని పక్షంలో ప్లాట్ రాసిస్తానని గతంలో పంచాయితీ చేశారు. సోమవారం కన్నయ్య వెళ్లి రాజవేలును అప్పు తీర్చమని అడిగాడు. లేని పక్షంలో ప్లాట్ రాసివ్వాలని కోరాడు. దీంతో రాజవేలు అయన అల్లుడు లోకేష్ కలిసి డబ్బు లేవు, ప్లాట్ ఇచ్చేది లేదంటూ దూషించారు. దీంతో మాటమాట పెరిగిన ఇరువర్గాల వారు తాటి మట్టలతో పరస్పర దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో ఇద్దరికి గాయాలై తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అయూబ్‌ఖాన్‌కు నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న అయూబ్‌ఖాన్

పుంగనూరు: సామాజిక సేవకుడు, అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పి.అయూబ్‌ఖాన్‌కు సోమవారం నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డును ఢిల్లీలో ప్రదానం చేశారు. న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ బాలకృష్ణన్, సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ అగర్వాల్ చేతులు మీదుగా అవార్డును ఆయన అందుకున్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనందుకు భారత్ మన్స్ ట్రస్ట్, ఇండియన్ గెలాక్సీ వారు సంయుక్తంగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు అయూబ్‌ఖాన్‌ను అభినందించారు.

గోసంరక్షణకే పాదయాత్ర

– ఉడిపి పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామీజీ

కార్వేటినగరం: ధర్మపరిరక్షణలో భాగంగా గోసంరక్షణ కోసమే గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తున్నానని ఆడమూరు(ఉడిపి) పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ ఈషాప్రియ తీర్థ స్వామీజీ అన్నారు. స్వామీజీ పాదయాత్రలో భాగంగా సోమవారం డీకేర్ కన్వెన్షన్ హాల్‌లో స్వామీజీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ ప్రేమికులు, ఆధ్యాత్మిక అన్వేషకులు, గోశాల సంరక్షకులు, అలాగే మన గ్రామీణ చేతివృత్తుల వారు, జానపదకళాకారులను కలసి వారికి ధర్మపరిరక్షణ చేయడమే లక్ష్యంగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. గ్రామాల్లో గోసంరక్షణ, గ్రామీణ చేతి వృత్తుల వారి అభివృద్ధి, రైతుల సంక్షేమం, జానపద కళ అభివృద్ధి కోరుతూ ఈ ఏడాది 300 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని, ప్రజలు సనాత ధర్మాన్ని పాటించాలన్నారు. ముఖ్యంగా దేశంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించే దిశగా అందరూ సమన్వయంతో పనిచేద్దామన్నారు. హైందవ ధర్మ పరిరక్షణలో భాగంగా సరిహద్దు ప్రాంతాలైన తమిళనాడులోని శోళిగరం మీదుగా కొల్లాగుంట సమీపంలోని డీకేఆర్ కన్వెన్షన్‌కు చేరుకున్న స్వామీజీకి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పాదపూజలు చేశారు. సోమవారం సాయంత్రం పళ్లిపట్టు మీదుగా నగరికి పాదయాత్ర చేసిన స్వామీజీకి పళ్లిపట్టులోని సంగమేశ్వర స్వామి ఆలయంలో వేద పండితులు, అర్చకులు పాదపూజలు చేశారు. రాత్రికి నగరిలో బస చేయనున్నట్లు తెలిపారు.

ఏనుగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

సాక్షి, అమరావతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపు మూలంగా పంటలు ధ్వంసం కావడం, కొందరు రైతులు దుర్మరణం పాలవుతున్న ఘటనలు చోటుచేసుకొంటున్న క్రమంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఇటీవలే తిరుపతి జిల్లా, చిన్నగొట్టిగల్లులో ఒక కౌలు రైతు ఏనుగుల దాడిలో చనిపోవడం, తాజాగా పాకాల మండలం, గానుగపెంటలో పంటలు ధ్వంసం చేసిన ఘటనలపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏనుగుల కారణంగా ప్రజలకు, ప్రజల వల్ల ఏనుగులకు హాని కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తిరుపతి డీఎఫ్‌ఓ పీ.వివేక్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. చిత్తూరు డీఎఫ్‌ఓ ఎస్.భరణితోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సంబంధించిన పీలేరు, తిరుపతి డీఎఫ్‌ఓలు, తిరుపతి సబ్ డీఎఫ్‌ఓలతోపాటు తిరుపతి భాకరాపేట, పనబాకం, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్ పరిధిలో ఎఫ్‌ఆర్‌ఓల టీమ్స్, పది మంది ఎలిఫెంట్ ట్రాకర్స్ ఈ టాస్క్‌ఫోర్సులో ఉంటారు. వీరి బాధ్యతలను కూడా నిర్దేశిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

ఏనుగుల నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్



మాట్లాడుతున్న సీసీఎఫ్ సెల్వం

తిరుపతి మంగళం : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏనుగుల నియంత్రణకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు తిరుపతి జిల్లా అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) సెల్వం తెలిపారు. సోమవారం సీసీఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్‌కు హెడ్‌గా తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ వ్యవహరిస్తారన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని భాకరాపేట, పనబాకం, తిరుపతి రేంజ్, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్ రేంజ్‌లలో ఏనుగుల దాడుల నుంచి ప్రజలను కాపాడుతామన్నారు. ఒక్కో రేంజ్‌లో పది మంది ఎలిఫెంట్ ట్రాకర్స్ ఉంటారని, వీరు ఆయా గ్రామాల పరిధిలో ఏనుగుల సంచారాన్ని గుర్తించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తారని తెలిపారు. సౌర విద్యుత్ ద్వారా పనిచేసే ఈ నూతన టెక్నాలజీ జీఎస్ఎమ్ సిమ్ ద్వారా ఏనుగుల కదలికలను బట్టి తిరుపతిలో ఏర్పాటు చేయబోయే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుందన్నారు. ఏనుగుల గుంపు కనపడితే టోల్ ఫ్రీ నం.1800 425 5909, తిరుపతి డీఎఫ్‌ఓ 9440810069, చిత్తూరు డీఎఫ్‌ఓ 9440810113, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ 9440810070, పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ 9440810114కు సమాచారం ఇవ్వాలని కోరారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా సుబ్రమణ్యం నాయుడు



చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాల(డీసీఎంఎస్) చైర్మన్‌గా సుబ్రమణ్యం నాయుడిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఈయన త్వరలో బాధ్యతలను చేపట్టనున్నారు. అయితే సుబ్రమణ్యం నాయుడు టీడీపీ చంద్రగిరి మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఐతేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడిగా పనిచేశారు.

ఆస్పత్రి నిర్లక్ష్యంపై సంతకాల సేకరణ

చిత్తూరు రూరల్ (రూరల్): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి నిర్లక్ష్య వైద్యంపై సోమవారం బీసీ నాయకుడు షణ్ముగం, స్వచ్ఛంద సంస్థ సభ్యులు కలిసి సంతకాల సేకరణ మొదలుపెట్టారు. గాంధీ విగ్రహం వద్ద సంతకాల సేకరణ చేయగా... రాజకీయాలకతీతంగా వచ్చి అధికసంఖ్యలో సంతకాలు చేశారు. సాయంత్రానికి 2వేల మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేసినట్లు వారు పేర్కొన్నారు.

ట్రైనీ కలెక్టర్‌గా నరేంద్ర పడాల్

– సివిల్స్‌లో ఆల్ ఇండియా స్థాయి 545 ర్యాంక్



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ట్రైనీ కలెక్టర్‌గా చిట్టపులి నరేంద్ర పడాల్ నియమితులయ్యారు. రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలానికి చెందిన ఆయన రెండో ప్రయత్నంలో సివిల్స్‌లో ఆల్ ఇండియా 545 ర్యాంక్ సాధించారు. ఆయన సోమవారం ట్రైనీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన ఉస్మానియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు. మారుమూల గ్రామంలో జన్మించిన ఆయన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సివిల్స్ సాధించారు.

ఖజానా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరేష్‌బాబు



చిత్తూరు కలెక్టరేట్ : ఖజానా, లెక్కల శాఖ ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డి.నరేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉద్యోగ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నరేష్‌బాబు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈయన చిత్తూరు జిల్లా ఖజానా సంఘం ఉపాధ్యక్షుడిగా 2008 నుంచి 2011 వరకు మూడేళ్లపాటు పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర సంఘ అడహాక్ కమిటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన్ని జిల్లా అధ్యక్షుడు చెంగల్రాయుడు, కార్యదర్శి పయణి, కోశాధికారి చలపతి, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.